క్లుప్తంగా

పశ్చిమ ప్రకాశంలో తూనికల అధికారుల దాడులు



తూకం చూస్తున్న ఇన్‌స్పెక్టర్ రియాజ్

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని కంభం, గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం ప్రాంతాల్లో బుధవారం వివిధ దుకాణాలపై తూనికలు, కొలతల శాఖాధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు మార్కాపురం తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ రియాజ్ తెలిపారు. తక్కువ తూకంతో అమ్ముతున్న బియ్యం బస్తాలను కంభంలోని వివిధ దుకాణాల్లో కనుగొని రెండు కేసులు నమోదు చేశారు. కనిగిరిలో బియ్యం దుకాణాలపై దాడులు నిర్వహించి మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో నెల్లూరు లీగల్ మెట్రాలజీ డిప్యూటీ డైరెక్టర్ కె ఇసాక్, పొదిలి ఇన్‌స్పెక్టర్ మోహిసీన్, సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.

రేపు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం చంద్రశేఖరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసీలో ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా ఫోన్‌లో తనకు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

కుమార్తె కనబడటం లేదని ఫిర్యాదు

దర్శి: తన కుమార్తె కనబడటం లేదని చిన్న ఉయ్యాలవాడకు చెందిన గాలం ఏడుకొండలు దర్శి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. అతని కుమార్తె, అల్లుడు వెంకటేశ్వర్లు ఈ నెల 19వ తేదీ రాత్రి దినచర్య పూర్తిచేసుకుని నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున 3 గంటలకు లేచి చూడగా తన భార్య కనిపించలేదని ఏడుకొండలుకు వెంకటేశ్వర్లు తెలిపాడు. అప్పటి నుంచి మామ, అల్లుడు, బంధువులు కలిసి ఆమె కోసం వెతికారు. కనిపించకపోవడంతో బుధవారం దర్శి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

దర్శి: మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన ఓ మహిళ తన భర్త లక్కెపోగు రత్నబాబు తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన మహిళకు దర్శి మండలం పోతవరం గ్రామానికి చెందిన లక్కెపోగు రత్నబాబుతో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక పాప, ఒక బాబు సంతానం కాగా, రత్నబాబు వ్యసనాలకు బానిసై నిత్యం మద్యం సేవించి భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. రత్నబాబుకు మరొక మహిళతో వివాహేతర సంబంధం కూడా ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

దర్శి: మండలంలోని సాయినగర్‌కు చెందిన అరటిపాముల సురేష్ అదే గ్రామానికి చెందిన వివాహితను లైంగికంగా వేధిస్తున్నాడని బుధవారం దర్శి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సురేష్ మంగళవారం రాత్రి ఆ గ్రామానికి చెందిన వివాహిత మహిళ ఇంటి గోడ దూకాడు. ఆమె కేకలు వేయడంతో ఆమె భర్త మేల్కొని సురేష్‌ను హెచ్చరించాడు. గతంలో కూడా ఇలాగే సురేష్ ఆ ఇంట్లోకి వెళ్లి ఆమెను లైంగికంగా వేధించినట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై సోమేపల్లి బస్టాండ్ ప్రాంతంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని సోమేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు బైక్‌పై ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో పి.అశోక్, హనుమంతు తీవ్రంగా గాయపడ్డారు. వీరికి త్రిపురాంతకంలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేట తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ

మార్టూరు: ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనం చోరీకి గురైన విషయమై మార్టూరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. స్థానిక ప్రభుత్వాసుపత్రి పక్కన నివాసం ఉండే బమాల శేఖర్ బాబు మంగళవారం రాత్రి తన హీరో డీలక్స్ బైకును పార్కు చేశాడు. బుధవారం ఉదయం బైకు కనిపించక పోవడంతో ఫిర్యాదు చేశాడు.

ఎమ్మెల్యే అన్నాకు స్వగ్రామంలో ఘన స్వాగతం

- సైదాపురంలో గడప గడపకు విశేష స్పందన

కంభం: నియోజకవర్గంలో అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే కందులాపురం పంచాయతీ పరిధిలోని తన స్వగ్రామం సైదాపురంలో పర్యటించారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. క్రేన్ సాయంతో గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే, ఆయన తనయుడు అన్నా కృష్ణచైతన్యకు గజమాల వేసి సత్కరించారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నాయకులను ఎమ్మెల్యే శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తన సొంతూరులో పర్యటించిన సందర్భంగా గ్రామస్తులు చూపించిన అభిమానం మరువలేనిదన్నారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లిన ఎమ్మెల్యే ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయన్నారు. నియోజకవర్గంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పంచాయతీ పరిధిలో ఆరుచోట్ల సైడు కాలువలపై కల్వర్టులు నిర్మించడం కోసం ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే, ఆయన కుమారుడు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. సాయంత్రం కందులాపురం–1 సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ (రజని), జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, ఏఎంసీ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, ఎంపీటీసీలు ఆనంద్, రఫీ, నాగరాజు, సుజాత, ఖాసింబీ, హసీనా, రామ్మూర్తి, సుబ్బులు, సయ్యద్ సలీం, సొసైటీ చైర్మన్ ఫజుల్లా రహమాన్, సర్పంచ్‌లు పల్నాటి బోడయ్య, మహబూబ్‌పీరా, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, రసూల్, బత్తుల సూర్యప్రకాష్, కటికల భాస్కర్, శరభారెడ్డి, అర్ధవీడు మాజీ ఎంపీపీ నన్నెబోయిన రవికుమార్, వరికుంట్ల సుబ్బారావు, పెద్ద కోటేశ్వరరావు, వినోద్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సైదాపురంలో ఎమ్మెల్యే అన్నా, కృష్ణచైతన్యను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

విమలమ్మకు మంత్రి సురేష్ ఘన నివాళి



విమలమ్మ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

మార్కాపురం టౌన్: రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి, డాక్టర్ ఆదిమూలపు సురేష్ పీఏ వినుకొండ శ్యామ్ ప్రకాష్ తల్లి విమలమ్మ(65) గుండెపోటుతో మృతి చెందారు.బుధవారం పట్టణంలోని కొండారెడ్డి కాలనీలోని నివాసానికి వెళ్లి విమలమ్మ భౌతికకాయానికి మంత్రి సురేష్ నివాళులర్పించారు. జార్జ్ విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్, విశాల్ తోపాటు పలువురు సంతాపం తెలిపారు.

తాగునీటి చెరువులకే సాగర్ జలాలు

- ఎన్ఎస్‌పీ ఈఈ వెంకటరాజు

దర్శి: నాగార్జునసాగర్ కాలువకు విడుదల చేసిన నీరు కేవలం తాగునీటి అవసరాల కోసమేనని ఎన్ఎస్‌పీ ఈఈ వెంకటరాజు తెలిపారు. జిల్లా ప్రజల తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. జిల్లాలోని నోటిఫైడ్ చెరువులు నింపుకునేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సాగర్ జలాలు బుధవారం ఒంగోలు బ్రాంచ్ కాలువ హెడ్‌రెగ్యులేటర్ దర్శికి చేరాయి. ఈ సందర్భంగా ఆయన కాలువను పరిశీలించి వివరాలు తెలిపారు. సాగర్ జలాలను రైతులు పొలాలకు వినియోగించవద్దని, కేవలం తాగునీటి కోసమేనని అర్థం చేసుకుని సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట దర్శి, కురిచేడు డీఈఈలు అక్బర్‌బాషా, ఆంజనేయప్రసాదు, జేఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



సాగర్ కాలువను పరిశీలిస్తున్న ఈఈ వెంకటరాజు, సిబ్బంది

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు
- కందులాపురంలో ఆర్‌బీకే ప్రారంభం

కంభం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. కందులాపురం–1 సచివాలయం పరిధిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, సబ్సిడీలు సులభతరంగా అందుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, ఇతర సౌకర్యాలన్నీ రైతులకు వారి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్నాయని, తద్వారా రైతులు పనుల కోసం మండల కేంద్రాల్లో ఉన్న కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని, రైతులు వేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసుకుంటే వారికి పంట నష్టపరిహారాలు, బీమా, గిట్టుబాటు ధరలు అందుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పని చేసే సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు వివరించారు. సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ (రజని), జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, వ్యవసాయ శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కందులాపురంలో ఆర్‌బీకేని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

చిరుధాన్యాల ఉత్పత్తిపై అవగాహన అవసరం



మహిళలకు చిరుధాన్యాలపై అవగాహన

దర్శి: చిరుధాన్యాల ఉత్పత్తి, వినియోగంలో భారతదేశం మొదటిస్థానంలో ఉందని దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లడి దేవకుమార్ తెలిపారు. చిరుధాన్యాల సాగు మెట్టప్రాంతాల్లో అనువైనదని, దళిత గిరిజన మహిళలు ఈ పంటల ఉత్పత్తిని ఎక్కువగా పెంచుకోవచ్చని ఆయన సూచించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన దళిత ఆదివాసీ మహిళలకు, ప్రభుత్వ అధికారులకు బుధవారం ముఖాముఖి సదస్సు నిర్వహించారు. దర్శిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వీఎస్ దుర్గాప్రసాదు మాట్లాడుతూ రోజువారీ ఆహారంలో చిరుధాన్యాల వినియోగాన్ని పెంచి మహిళల ఉపాధి అవకాశాల దిశగా నడిపించడానికి వివిధ రకాల రుచికరమైన ఆహార ఉత్పత్తుల తయారీ విధానాన్ని తెలుసుకోవాలని సూచించారు. తద్వారా ఆర్థిక అభివృద్ధి చెందడానికి మహిళలకు ఎక్కువ అవకాశం ఉందన్నారు. దేశీయ ధాన్యాలైన కొర్రలు, ఆరికలు, సామలు, వరిగలు, రాగులును ఆహారంగా వినియోగిస్తే మంచి ఆరోగ్యంతో పాటు జీవవైద్యానికి, పశుసంరక్షణకు, రైతు సంక్షేమానికి, వ్యవసాయరంగ పరిరక్షణకు చక్కటి పరిష్కారమార్గం ఏర్పడుతుందని పశుసంవర్థకశాఖ డాక్టర్ లీలా కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ఉష, దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ మహిళా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎం.హేమలత, దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ముండ్లమూరు, దర్శి ఏరియాల కో ఆర్డినేటర్లు గోపనబోయిన వెంకట్రావు, గుంటూరు నాగమణి, మహిళలు పాల్గొన్నారు.

326 మందికి వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్ బ్రహ్మనందరెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లెలో గిద్దలూరుకు చెందిన బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 326 మందికి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 39 మందికి కంటి శస్త్ర చికిత్సలు, 9 మందికి సాధారణ, ఆరుగురికి ఈఎన్‌టీ శస్త్రచికిత్సలు అవసరమని డాక్టర్లు గుర్తించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు వివరాలు ఈ-క్రాప్‌లో నమోదు చేయాలి

ముండ్లమూరు: గ్రామాల్లోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ–క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫారుక్ సిబ్బందికి సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం గ్రామ వ్యవసాయ సహాయకులు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటల వాస్తవ వివరాలను మాత్రమే ఈ క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. రైతుల పొలాలను సందర్శించి పరిశీలించి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. సమావేశంలో డీటీ పుల్లారెడ్డి, వీపీఏలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ ఫారుక్

సైనికుల త్యాగాలు మరువలేనివి



అమరుల చిత్రపటాలకు సెల్యూట్ చేస్తున్న మాజీ సైనికులు

మార్కాపురం: సైనికుల త్యాగాలు మరువలేనివని మాజీ సైనికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శీలం హరినారాయణరెడ్డి, వావిచర్ల శేషయ్య పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బుధవారం మాజీ సైనికుల సంఘ కార్యాలయంలో అమరులైన కార్గిల్ వీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్గిల్ వీరులారా అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారి చిత్రపటాలకు సెల్యూట్ చేశారు.

దివ్యాంగులకు పాఠశాలల్లో అడ్మిషన్ ఇవ్వాలి

యర్రగొండపాలెం: దివ్యాంగ విద్యార్థులను బడిలో చేర్చుకోవాలని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లు నాయక్ ఆదేశించారు. స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం మండలంలోని పెద్ద బోయలపల్లె, చిన్నబోయలపల్లె, అమానిగుడిపాడు గ్రామాలను వారు సందర్శించారు. వారు బడి మానివేసిన పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ఆరుగురు బడిలో చేరేవిధంగా చర్యలు తీసుకున్నారు. వారిలో ముగ్గురు దివ్యాంగులు ఉన్నారని, వారిని కూడా బడిలో చేర్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని వసతులు సమకూర్చిందని, అంతేకాకుండా అమ్మఒడి పథకం ద్వారా బడిలో చేరిన ప్రతి విద్యార్థి తల్లి అకౌంట్‌లో రూ.15 వేలు జమ చేస్తోందని, జగనన్న విద్యా కిట్లతో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం, బూట్లు అందజేస్తోందని, పాఠశాలలో మంచి పౌష్టికాహారం పిల్లలకు అందిస్తున్నారని, దివ్యాంగులకు ప్రయాణ ఖర్చులు, అవసరమైన పరికరాలు అందజేయనున్నట్లు వివరించారు. హెడ్మాష్టర్లు హెమ్లానాయక్, ప్రభాకర్, ఎంజే ప్రసాద్, శ్రీకాంత్, శ్రీను ఉన్నారు.



దివ్యాంగ విద్యార్థితో ఎంఈవో ఆంజనేయులు

ఆంగ్ల భాషతో ప్రపంచ స్థాయిలో గుర్తింపు

మార్కాపురం టౌన్: విద్యార్థులకు ఆంగ్ల భాషపై పూర్తి అవగాహన కల్పిస్తూ వారిలో భయాందోళనలు తొలగిస్తే ప్రపంచ స్థాయిలో రాణిస్తారని, ఆ దిశగా ఆంగ్ల ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ–1, 2 రాందాస్‌నాయక్, శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మార్కాపురం, తర్లుపాడు మండలాల ప్రభుత్వ పాఠశాలలోని ఆంగ్ల ఉపాధ్యాయుల ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కాంప్లెక్స్ చైర్మన్, జెడ్పీ హెచ్‌ఎం ఎం.చంద్ర శేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు తెలియజెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎం శివప్రసాదరావు, రిసోర్స్ పర్సన్స్ డానియేల్ ప్రభాకర్, అన్నెం ప్రభాకరరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ రాందాస్‌నాయక్

మణిపూర్ ఘటనపై క్రైస్తవుల నిరసన



కంభం: కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గిద్దలూరు రూరల్: మణిపూర్‌లో జరిగిన విధ్వంస ఘటనకు నిరసనగా డివైన్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు బుధవారం పట్టణంలోని రాచర్ల గేటుసెంటర్, కుమ్మరాంకట్ట సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, పలు వీధుల్లో నిరసన వ్యక్తం చేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ పోతెపోగు ఎఫ్రారావు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన సంఘటన యావత్ ప్రపంచానికే సిగ్గు చేటన్నారు. ఈ విషయమై ప్రభుత్వాలు బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. డివైన్ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు, దైవసేవకులు పాల్గొన్నారు.

కంభం: మణిపూర్‌లో మహిళలపై అమానుష అత్యాచారాలకు, హింసాకాండకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం స్థానిక కందులాపురం కూడలిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రెండు తెగల మధ్య చిచ్చుపెట్టి హింసను రాజేసి బీజేపీ ప్రభుత్వం ఏం తెలియనట్లు నాటకాలుడుతోందని ప్రకాశం జిల్లా ఆవాజ్ కమిటీ కార్యదర్శి బేగ్ అన్నారు. బాధితులు కేసులు పెట్టినా నమోదు చేయకపోవడం బాధాకరమన్నారు. ఘటనకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి దానం, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు మహబూబ్ బాషా, కొత్తూరు, రైతు నాయకులు గాలయ్య, రిక్షా సంఘ నాయకులు, ఆవాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గురువారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ముఖ్య అతిథిగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరవుతారని, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంటీసీలు, పార్టీ పలు విభాగాల నాయకులు, మండల అధికారులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- మండల ప్రత్యేకాధికారి రమణ

ముండ్లమూరు: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి పీవీ రమణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకంలో అర్హత గల ప్రతి కుటుంబానికి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిలిచిపోయిన జగనన్న పాలవెల్లువ కేంద్రాలను పునఃప్రారంభించేందుకు వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, పశువైద్యశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కె.కుసుమకుమారి, పరిపాలనాధికారి ఎస్‌వీఎల్ హనుమంతరావు, ఏఈలు హనుమంతరావు, వెంకటేశ్వరరావు, ఈఓఆర్డీ రాజశేఖరరెడ్డి, ఏఓ ఫారుక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రమణ

భక్తిశ్రద్ధలతో చిన్న షరిగత్



వంగపాడులో కొలువైన పీర్లు

బేస్తవారిపేట: మండలంలోని పలు గ్రామాల్లో మొహరం పండగ సందర్భంగా పీర్ల బావిడ్లను విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రత్యేకంగా లంకరించిన పీర్లను పీర్లచావిడ్లలో దించారు. వంగపాడులో చిన్న షరిగత్ సందర్భంగా పీర్లతో గ్రామోత్సవం నిర్వహించారు. పీర్ల చావిడ్ల వద్ద పెద్ద షరిగెత్ కోసం అగ్ని గుండం ఏర్పాటు చేశారు.